


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
నేటి సందేశాల రేపటి పొద్దు జాడ — 20 YEARS ANNIVERSARY
https://www.satyamdaily.net/
బుధవారం 6-8-2025
సంపుటి: 21 సంచిక: 115
పేజీలు: 8 వెల: రూ.1

# కళింగకోమట్లలో ఎన్నికల కుంపటి!





**జిల్లాలో కళింగకోమటి సామాజికవర్గ ఓటర్ల సంఖ్య ఎంతనేది ఇప్పటికీ ఇదమిద్ధంగా తెలియదు. అసలు జిల్లా జనాభాలో వీరి శాతం ఎంతనే అంచనా కూడా లేదు. కానీ వెలమ, కాళింగ, కాపు, ఎస్సీ, శ్రీశయన కులాలు మినహా మిగిలిన మైనార్టీలందరికంటే కళింగకోమట్లు ఎక్కువగా ఉంటారనేది ఓ అంచనా. 2024 ఎన్నికలకు ముందు శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి ధర్మాన ప్రసాదరావు చేయించిన సర్వేలో ఇదే ప్రతిఫలించింది. అయితే ఇది సాధికారికం కాదు. అయితే మైనార్టీ కులాల్లో కళింగకోమట్ల ప్రాబల్యం ఎక్కువని ఒప్పుకోక తప్పదు. ఎందుకంటే.. వ్యాపారమే వృత్తిగా ఉన్న ఈ సామాజికవర్గం సోషల్ మీడియా పుట్టకముందు నుంచీ ప్రచారం(మౌత్‌టాక్)లో టాప్. అందుకే ధర్మాన, ఎర్రన్నాయుడు లాంటి రాజకీయ ఉద్ధండులు కూడా కళింగకోమట్లకు సముచిత స్థానం కల్పిస్తూ వచ్చారు. బహుశా అందుకేనేమో జిల్లాలో ఏ సామాజికవర్గ సంఘానికి ఎన్నిక జరిగినా రాని కాంట్రవర్సీ, ప్రచారం ఈ కుల సంఘం విషయంలో ఏర్పడుతుంది. అలాగే దీనికి అధ్యక్షునిగా ఎన్నికైనవారికి కూడా ఆ స్థాయి ప్రోటోకాల్ దక్కుతుంది. అందువల్ల ఈ కుల సంఘ పదవులకు పోటీ తీవ్రస్థాయిలోనే ఉంటుంది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ సానుభూతిపరులే జిల్లా, రాష్ట్ర, నగర పార్టీ అధ్యక్షులుగా ఉండాలన్నంత స్థాయిలో ఉంటుంది.**

- మొన్నటి వరకు హరిగోపాల్‌దే బలం
- అనూహ్యంగా తెరపైకి ఉణ్ణ సర్వేశ్వరరావు
- నగర అధ్యక్ష పదవి కోసం రసవత్తర పోరు
- ఎవరికి జైకొట్టాలో అర్థంకాక ఆపసోపాలు

సత్యంన్యూస్, శ్రీకాకుళం

### అధికారంలో ఉండే పార్టీ వారిదే పెత్తనం

సాధారణంగా కులసంఘాలకు కాలపరిమితి తప్ప పాలకులతో పనిలేదు. కానీ అధికార పార్టీలో ఉన్నవారే స్థానికంగానూ పదవుల్లో ఉండాలని గత ప్రభుత్వ హయాంలో వైకాపా నేతలే తీర్మానించారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు కోణార్క్ శ్రీను రాష్ట్ర కళింగకోమటి అధ్యక్షుడిగా ఉంటే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బోయిన గోవిందరాజులు రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ఇప్పుడు జిల్లా సంఘానికి, శ్రీకాకుళం నగర సంఘానికి కొత్త కార్యవర్గం కావాలి. సరిగ్గా ఇదే ఇప్పుడు కులపెద్దలకు పెద్ద జంఝాటంగా మారింది. ప్రస్తుతం నగర కళింగ కోమటి సంఘ అధ్యక్షుడిగా ఉన్న ఉణ్ణ నాగరాజు పదవీకాలం 2026 వరకు ఉంది. కానీ 2024లో కూటమి ప్రభుత్వం రావడం వల్ల గతంలో చేసుకున్న తీర్మానం మేరకు కొద్ది రోజుల క్రితం నాగరాజు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కొత్త నగర అధ్యక్షుడిని ఎన్నుకోవాలి. నగరంలో కళింగకోమట్ల ప్రాబల్యం ఎక్కువ. అలాగని సంఖ్యాపరంగా అందరికంటే వీరు ముందువరుసలో ఉన్నారని కాదు. నలుగురు కోమట్లు ఒకచోట ఉంటే చాలు మిగిలిన సామాజికవర్గాలకు చెందిన పాతిక మందితో సమానమన్న నానుడి ఉంది. ఇంత పట్టున్న నగర అధ్యక్ష పదవి కోసం గత కొన్ని నెలలుగా కళింగకోమట్లు కుస్తీలు పడుతున్నారు. వైకాపా నుంచి ఎటువంటి పోటీ లేకపోవడంతో తెలుగుదేశంలో ఉన్న నేతలే నగర అధ్యక్ష, కార్యదర్శి పదవులు దక్కించుకోవడానికి పావులు కదుపుతున్నారు. ఏకాభిప్రాయ సాధనకు పలుమార్లు సమావేశమవుతున్నా కుదరక అవి వాయిదా పడుతూ వస్తున్నాయి. ఎందుకంటే.. ఎన్నిక ప్రక్రియకు ఇక్కడ అవకాశం లేదు. ఎంతమంది సభ్యులున్నారు? ఎంతమంది ఓటర్లవుతారు? అనే లెక్కలు సాధారణంగా కులసంఘాల వద్ద ఉండవు. కొందరు పెద్దలు ఎవరికి బొట్టు పెడితే వారే అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్లు అవుతుంటారు. ఏ కులసంఘంలోనైనా దాదాపు ఇదే తంతు ఉంటుంది. కానీ కళింగకోమటి సంఘం దగ్గరికి వచ్చేసరికి ఎన్నిక తప్ప, ఎంపిక ప్రక్రియ కుదిరేలా కనిపించడం లేదు. శ్రీకాకుళం నగర నడిబొడ్డులో కళింగవైశ్యుల పేరిట ఒక కల్యాణ మండపం, దాని ఖాతాలో లక్షలాది రూపాయల సొమ్ము, అదే స్థాయిలో ఛారిటబుల్ ట్రస్ట్, దాని అకౌంట్‌లో మరికొంత సొమ్ము ఉండటం వల్ల ఇది డబ్బున్న సంఘం అయ్యింది. అందువల్ల ఈ సంఘానికి డబ్బున్నోళ్లే అధ్యక్ష, కార్యదర్శులు కావాలనే నినాదం ఒకటి తెరమీదకు వచ్చింది. కళింగకోమటి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, కార్తీక వనభోజనాలు, సామూహిక ఉపనయనాలు వంటి పెద్ద పెద్ద కార్యక్రమాలు చేపట్టే కళింగకోమటి సంఘం జిల్లా, నగర అధ్యక్ష పదవులు ఇప్పుడు ప్రోటోకాల్ పోస్టులుగా మారిపోయాయి.

### నిన్నటి వరకు ఒక లెక్క.. ఇప్పుడో లెక్క

రెండురోజుల క్రితం వరకు తెలుగుదేశం పార్టీ నాయకుడు కోరాడ హరిగోపాల్, కోరాడ రమేష్‌ల పేర్లు మాత్రమే తెర మీద కనిపించాయి. హరిగోపాల్‌కు నగరంలో - మిగతా చివరి పేజీలో



- నందాదేవి పర్వతంపై దశాబ్దాలుగా రహస్య పరికరం
- చైనాపై నిఘాకు భారత్-అమెరికా రహస్య మిషన్
- మంచు తుపానుతో దాని ఏర్పాటులో విఫలం
- అక్కడే మంచుపొరల్లో సమాధి.. దశాబ్దాలుగా లభించని ఆనవాళ్లు
- ఎప్పటికైనా దానితో ప్రమాదమేనని శాస్త్రవేత్తల ఆందోళన

# మంచుకొండల్లో దాగిన అణుముప్పు!

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

పౌర అవాసాలపై మొదటి అణుబాంబు ప్రయోగం జరిగి సరిగ్గా 80 ఏళ్లు అయ్యింది. చరిత్ర పుటల్లోకి వెళితే.. రెండో ప్రపంచ యుద్ధం ముగింపునకు ముందు 1945లో ఇదే రోజు.. అంటే ఆగస్టు ఆరో తేదీన జపాన్‌లోని హిరోషీమా, తొమ్మిదో తేదీన నాగసాకి నగరాలపై అమెరికా అణుబాంబులు ప్రయోగించి తీవ్ర విధ్వంసం, వినాశనం సృష్టించింది. అప్పటినుంచీ అణుముప్పు ప్రపంచాన్ని వెంటాడుతూనే ఉంది. ఎన్ని ఒప్పందాలు కుదిరినా, ఎన్ని ఆంక్షలు ఉన్నా.. అమెరికాతో సహా అభివృద్ధి చెందిన దేశాలు మొదలుకొని పాకిస్తాన్‌లాంటి చిన్న దేశాలు సైతం అణుబాంబులు తయారుచేసి.. అవసరమైతే వాటిని శత్రు దేశాలపై ప్రయోగిస్తామని బెదిరిస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ సమయంలో పాక్ నేతలు, సైన్యాధికారులు ఇటువంటి బెదిరింపులకే పాల్పడ్డారు. మరో వైపు అణుబాంబులు కలిగి ఉన్న ఇరాన్, రష్యాలపై ఆంక్షలు విధిస్తున్న అమెరికా పెద్దస్థాయిలో అణుబాంబులు తయారు చేస్తోంది. ఫలితంగా ప్రపంచం మొత్తం ప్రస్తుతం అణుకుంపటిపై ఉంది. మరోవైపు దేశానికి పెట్టని కోటలా ఉన్న హిమాలయాలు తమ గర్భంలో ఒక ప్రమాదకరమైన అణుపరికరాన్ని సుమారు ఆరు దశాబ్దాల నుంచి దాచుకున్నాయని ఇప్పటి తరానికే కాదు.. అప్పటి తరంలోని మెజారిటీ ప్రజలకు కూడా తెలియక పోవచ్చు. ఎందుకంటే.. ఒక రహస్య ఆపరేషన్‌లో భాగంగా నాడు హిమాలయాల్లో భారత్–అమెరికా కలిసి ఆ పరికరాన్ని ఏర్పాటు చేశారు. కానీ దురదృష్టవశాత్తు ఆ రహస్య ఆపరేషన్ ముందుకు సాగలేదు.. ఆ అణు పరికరం కూడా లభించలేదు. దాని వల్ల ఎప్పటికైనా హిమాలయాలకు తద్వారా భారత్‌తో సహా హిమాలయ దేశాలకు ప్రమాదం తప్పదన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



### చైనాపై నిఘా లక్ష్యంగా..

సుమారు 60 ఏళ్ల క్రితం 1965లో.. మనదేశం, అమెరికా సంయుక్తంగా ఓ రహస్య మిషన్ చేపట్టాయి. హిమాలయాల్లోని నందాదేవి పర్వతంపై అణుశక్తితో పనిచేసే ఒక పరికరాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. చైనా దేశంపై - మిగతా 4లో





• ఎడిటోరియల్

# ప్రశ్నించడం.. ఆరోపించడం.. ఒకటేనా!

ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి విధి అని.. దాన్ని కోర్టు తప్పుపట్టడం ఏమిటంటూ కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి. న్యాయ, పార్ల మెంటరీ వ్యవస్థల అధికారాలు, హక్కుల దిశగా ఆమె వ్యాఖ్యలు దారిమళ్లుతున్నాయి. సుప్రీంకోర్టు ధర్మాసనం ఒక కేసు విచారణ సందర్భంగా మొన్న సోమవారం రాహుల్ గాంధీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు, వేసిన ప్రశ్నలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఆ వ్యాఖ్యలను తప్పుపడుతూ ప్రియాంక వ్యక్తం చేసిన అభిప్రాయాలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సార్వత్రిక ఎన్నికలకు ముందు 2022లో భారత్ జోడో యాత్ర చేశారు. ఆ యాత్రలో భాగంగా పలు చోట్ల ప్రసంగిస్తూ మన దేశానికి చెందిన రెండువేల కిలోమీటర్ల భూభాగాన్ని చైనా ఆక్రమించినా.. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అడ్డుకోలేకపోయిందని. పైగా చైనా ఎటువంటి ఆక్రమణకు పాల్పడలేదని మోదీ సర్కార్ అబద్ధాలు చెబుతోందని తీవ్రంగా ఆరోపించారు. ఈ ఆరోపణల ద్వారా మనదేశ సైన్యాన్ని రాహుల్ అవమానించినందున, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై విచారణ జరగకుండా స్టే విధించాలని కోరుతూ రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏసీ మాసిహ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. చైనా రెండువేల కిలోమీటర్లు ఆక్రమించిందనడానికి ఏవైనా ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ పిటిషన్‌పై విచారణను నిలిపేయడంతో పాటు తిరిగి ఆయనకే నోటీసులు జారీ చేసింది. సమస్యల ప్రస్తావనకు, ప్రశ్నలు వేయడానికి పార్లమెంటు ఉంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ పార్లమెంటులో ప్రస్తావించకుండా సోషల్ మీడియాలోనో, బహిరంగ వేదికల పైనో ఆధారాలు లేని ఆరోపణలు చేయడమేమిటని మందలించింది. ఇలాంటి సమస్యలపై పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడరని నిలదీసింది. నిజమైన భారతీయులెవరూ ఇలాంటి అసంబద్ధ ఆరోపణలు చేయరని కూడా వ్యాఖ్యానించింది. సుప్రీం ధర్మాసనం చేసిన ఈ మందలింపులపై అటు కాంగ్రెస్.. ఇటు ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. రాహుల్ వాస్తవాలే మాట్లాడారని, 'తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు' అనే కేంద్ర సర్కారు విధానంలో భాగంగానే ఆయనపై ఫిర్యాదులు నమోదయ్యాయని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ విమర్శించారు. అయితే పాలక బీజేపీ దీన్ని కౌంటర్ చేసింది. విదేశీ శక్తులు రాహుల్‌గాంధీని రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేస్తున్నారని ఆరోపించింది. ఆధారాలు లేని వ్యాఖ్యలు చేసినందుకు సుప్రీంకోర్టు మందలించిన తర్వాతైనా రాహుల్ తీరు మార్చుకుంటారని ఆశిస్తున్నామని పార్లమెంటు వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు అన్నారు. ప్రతిపక్ష నాయకుడు ఇలాంటి ప్రకటనలు చేయడం దేశానికి హానికరం, మన సైన్యానికి నిరుత్సాహకరమని వ్యాఖ్యానించారు. మరోవైపు ఎంపీ ప్రియాంక గాంధీ తన సోదరుడు రాహుల్‌ను సమర్థించే క్రమంలో పార్లమెంటు ఆవరణలో మాట్లాడుతూ ప్రశ్నలు వేయడం, ప్రభుత్వాన్ని సమస్యలపై నిలదీయడం ప్రతిపక్ష నేత విధి అని పేర్కొన్నారు. చైనా ఆక్రమణకు పాల్పడిందన్న ఆరోపణలను పార్లమెంటులో కాకుండా బయట ప్రస్తావించడాన్ని ధర్మాసనం తప్పుపట్టడంపై స్పందిస్తూ ఈ ప్రభుత్వం పార్లమెంటులో ప్రతిపక్షాలను మాట్లాడనివ్వడమే లేదని, ఒకవేళ ప్రశ్నలు వేయగలిగినా వాటిని దాటవేస్తోందని ఆమె విమర్శించారు. అయితే ధర్మాసనం వ్యాఖ్యలను ప్రియాంక వ్యతిరేకించడం న్యాయస్థానాలను వ్యతిరేకించడమే అవుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఆధారాలు లేకుండా సున్నితమైన అంశాలపై బహిరంగ ఆరోపణలు చేయడం తగదని కోర్టు భావించడం సమంజసమేనని పలువురు అభిప్రాయపడ్డారు. ఇటువంటి అంశాలను పార్లమెంటులోనే ప్రస్తావించవచ్చు కదా.. అని కోర్టు ప్రశ్నించింది. కానీ చిత్రంగా సరిహద్దు సమస్య, విదేశీ ఆక్రమణగా చెబుతున్న రాహుల్ ఇంత వరకు దాన్ని పార్లమెంటులో ప్రస్తావించలేదు. కాగా నిజమైన భారతీయులెవరూ ఇలా చేయరని సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు మాత్రం కాస్త ఇబ్బందికరంగా ఉన్నా.. నిజమైన భారతీయులెవరో తేల్చేది జడ్జీలు కాదు'.. అని వ్యాఖ్యానించిన ప్రియాంక అదే సమయంలో కోర్టులు, న్యాయమూర్తులపై తనకు గౌరవం ఉందని చెప్పడం విశేషం.

## జిల్లావ్యాప్తంగా విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు, ట్రాఫిక్ ఉల్లంఘనపై ఆగస్టు నెలంతా జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రహదారి మార్గంలో మద్యం సేవించి వాహన చోదకులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టి రహదారి ప్రమాదాలు నివారణ చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని డీజీపీ సూచించారన్నారు. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా సోమవారం రాత్రి చేపట్టిన స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా పట్టుబడిన వాహన చోదకులపై కేసులు నమోదు చేశామన్నారు. రోడ్డు సేఫ్టీపై ఈ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్ ఆగస్టు నెలంతా రోడ్డు భద్రత నియమాలకు సంబంధించి అతివేగం, హెల్మెట్ ధారణ, బ్లాక్‌స్పాట్ అంశాలపై తనిఖీలు నిర్వహిస్తామన్నారు.



## బార్ అసోసియేషన్‌లో "రక్షాబంధన"

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అందరూ సోదరాభిమానంతో మెలగాలని, రక్షాబంధనం పవిత్రతకు ప్రతీక అని శ్రీకాకుళం బ్రహ్మకుమారీస్ జయలక్ష్మి నిర్మల దేవి రాధ బుధవారం అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణ, బార్ అసోసియేషన్‌లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు మంగళవారం, బుధవారం జరిగాయి. భారతదేశంలో జరుపుకునే పండగలలో, ఒక ప్రత్యేకమైన సందేశాన్ని ఇచ్చే పర్వదినం రక్షాబంధనమని, సమున్నత విలువలకు ప్రత్యేకగా ప్రారంభించబడిన రక్షాబంధన పర్వదినం కాల ప్రవాహంలో దాని యదార్ధ స్వరూపం మారిపోయిందన్నారు. రక్షా అనగా కేవలం శారీరక రక్షణగా భావించి బవబంధాల నుండి మనుషులు విముక్తులు అవ్వాలని కోరుకుంటున్నారు కానీ ఈ విశిష్ట పర్వదినం అయిన రక్షాబంధనం మానవులను ఒక దివ్య బంధంలో బంధింపబడాలని సందేశాన్నిస్తోందన్నారు. కావున రాఖీ లేక రక్షాబంధనం కట్టించుకోవడానికి కట్టడానికి ఉత్సాహంతో ముందుకు రావాలన్నారు. ఈ పవిత్ర పర్వదినం విషతుల్యమైన చెడు విడిచిపెట్టి, ప్రతి ఒక్కరు పవిత్రంగా పుణ్యాత్ములుగా కావాలని సందేశాన్ని ఇస్తుందన్నారు. బార్ అసోసియేషన్ సభ్యుల బృందానికి, న్యాయవాద సోదరులకు రాఖీ కడుతూ ఆశీర్వదించారు. అనంతరం అసోసియేషన్ ప్రెసిడెంట్ తంగి శివప్రసాద్ రాఖీ పర్వదిన విశిష్టతను కొనియాడుతూ, ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఇప్పిలి సీతరాజు, జనరల్ సెక్రెటరీ పెద్ద దామోదర్, జాయింట్ సెక్రెటరీ మోటూరు భవానిప్రసాద్, ట్రెజరర్ కొమార శంకర్రావు, లైబ్రరీ సెక్రటరీ కొమ్ము రమణ మూర్తి, సీనియర్ లాయర్ రాధాకృష్ణ, స్పోర్ట్స్ సెక్రటరీ త్రిపుర వరప్రసాద్, రెప్రెజెంటేటివ్ జి.వనజాక్షి, వాణా కృష్ణా చందు తదితరులు పాల్గొన్నారు.




## 12న మెగా జాబ్ మేళా

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఈనెల 12న నరసన్నపేటలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నరసన్నపేట పద్మావతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆగస్టు 12న (మంగళవారం) ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఈ మేళాలో డెక్కన్ ఫైన్ కెమికల్స్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీం లీజు, డిక్సన్ టీవీ, తోషిబా, మొదలగు 11 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని 500 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, చదివిన 18 నుండి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువతి యువకులు అర్హులని కలెక్టర్ తెలిపారు.


ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, హైదరాబాద్, శ్రీసిటీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో కలిసి ఉదయం 9 గంటలకు మేళా ప్రాంగణానికి రావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9949900672, 63010 46329 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

## చెవిలో పువ్వుతో వినూత్న నిరసన

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను ఎవరి ప్రయోజనాల కోసం విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేస్తున్నారో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు. అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టెక్కలి డిపో ఏర్పాటు చేయవద్దు –మా డిపోయే మాకు ముద్దు అంటూ చెవిలో పువ్వులు పెట్టుకొని ఎచ్చెర్లలో బుధవారం ఏపీఎస్.బీసీఎల్ (ఐఎంఎల్) డిపో హమాలీలు వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేయడం వలన ఎవరికి ప్రయోజనం ఉందని ప్రశ్నించారు. ఎచ్చెర్లలో 100మంది దళిత కుటుంబాలకు చెందిన 4ఎకరాలు భూములను ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని దళిత కుటుంబాల వారికి హమాలీలుగా ఉపాధి కల్పించారన్నారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఐయంఎల్ డిపోలో 80మంది హమాలీలుగా లోడింగ్, అన్‌లోడింగ్ పనులు పనిచేస్తూ రోజు వారీ వచ్చే ఆదాయం పైనే 350కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ఒక డిపోగా కొనసాగుతున్న దాన్ని విడగొట్టి ఇప్పుడు కొత్తగా మరో డిపో ఏర్పాటు వలన ప్రజలకు ఏమైనా ప్రయోజనం ఉందా అని ప్రశ్నించారు. ఎచ్చెర్ల డిపో పైనే ఆధారపడిన 80 దళిత, పేద కుటుంబాలకు చెందిన హమాలీలకు తగినంత ఆదాయం లేక కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. దళితులు, పేదల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డిపోను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. టెక్కలి మండలం తిర్లంగి గ్రామంలో అదనంగా మరో మద్యం డిపో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ బీసీఎల్ హమాలీస్ యూనియన్ నాయకులు దుప్పాడ బంగార్రాజు, టీటీ రామారావు, నిడిగంట్ల రమణ, గజినీ శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము, సొంట్యాన శ్రీనివాసరావు, నవిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.






# జాతీయ పురస్కారాలు.. ఓ బాయ్‌కట్.. ఓ ప్రశ్న!!

2018లో 65వ జాతీయ పురస్కారాలు ప్రకటించారు. ఢిల్లీలో అవార్డుల ప్రధానోత్సవం. కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం, దేశ అత్యున్నత పౌరుడైన రాష్ట్రపతి లేదా ఆ తర్వాతి స్థానంలో ఉన్న ఉపరాష్ట్రపతి ఈ అవార్డులు అందిస్తారు. ఈసారి కూడా అలాగే అందిస్తారని అవార్డు గ్రహీతలు అనుకున్నారు. తీరా కార్యక్రమానికి ముందు పరిస్థితి మారిపోయింది. అనివార్య కారణాల వల్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పూర్తి కార్యక్రమానికి హాజరు కాలేరని, ఆ స్థానంలో అప్పటి కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ అవార్డులు అందిస్తారని ప్రకటించారు. ముఖ్యమైన కొన్ని అవార్డులు మాత్రమే రాష్ట్రపతి ఇస్తారని తెలిపారు. అవార్డు గ్రహీతల్లో చాలామంది అసంతృప్తి చెందారు. జీవితంలో ఒక్కసారి అందుకునే జాతీయ పురస్కారం రాష్ట్రపతి కాకుండా మరెవరో రాజకీయ నాయకురాలు ఇవ్వడం వారికి నచ్చలేదు. కానీ తప్పదని ఓపిగ్గా కార్యక్రమంలో కూర్చున్నారు. అయితే మలయాళీలు మహా పౌరుషమైన మనుషులు. మొత్తంగా ఆ కార్యక్రమాన్ని బాయికాట్ చేశారు.

- విశీ (వి.సాయివంశీ)

ఆ కార్యక్రమంలో గాయకుడు జేసుదాస్, మలయాళ దర్శకుడు జయరాజ్ ఉన్నారు. వారు మినహా మిగిలిన మలయాళీలు కార్యక్రమం నుంచి వెళ్లిపోయారు. వాళ్లను చూసి మిగిలిన భాషల్లోని మరికొందరు సైతం అదే బాట పట్టారు. అక్కడి నుంచి విమానం ఎక్కి వాళ్ల వాళ్ల ఊళ్లకు వెళ్లిపోయారు. వారి కుర్చీలు ఖాళీగా కనిపిస్తే పరువు పోతుందన్న భయంలో మొత్తంగా వారి పేరు రాసి ఉన్న స్థానాలు అక్కడి నుంచి తీసేశారు. మొత్తంగా ఆ కార్యక్రమం చాలా హడావిడిగా, అస్తవ్యస్తంగా జరిగింది. (ఆ తర్వాత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన పదవీ కాలంలో సినీ పురస్కారాల ప్రదానోత్సవానికి మళ్లీ రాలేదు. అవార్డులిచ్చే బాధ్యతను అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తీసుకున్నారు)

అలా వెళ్లిపోయిన వారిలో జాతీయ ఉత్తమ సహాయనటుడు పురస్కారం అందుకోవాల్సిన ఫహాద్ ఫాజిల్(అవును ఆయనే), జ్యూరీ ప్రత్యేక పురస్కారం అందుకోవాల్సిన పార్వతి ఉన్నారు. ఇద్దరికీ అవి తొలి జాతీయ పురస్కారాలు. ఎంతో ఆశ ఉంటుంది. ఎంతో ప్రేమ ఉంటుంది. అయితే ఏంటి? తమ గౌరవం తమదే. దాన్నెందుకు వదులుకోవాలి? రాజకీయాలకు అతీతంగా ఉంటారని పేరుపొందిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి స్థాయి వ్యక్తులు ఇవ్వాల్సిన పురస్కారాలు సంప్రదాయానికి విరుద్ధంగా మరెవరో రాజకీయ నాయకురాలు ఇస్తే తామెలా తీసుకుంటాం? అందుకే బాయ్‌కాట్. ఏమైనా మలయాళీలు మలయాళీలే!

ఇప్పుడు నటి ఊర్వశి వంతు. మలయాళ సినిమా 'ఉల్లోళుక్కు'కుగానూ ఈ ఏడాది ఆమెకు జాతీయ ఉత్తమ సహాయనటి పురస్కారం ప్రకటించారు. ఇదే సినిమాకుగానూ కేరళ ప్రభుత్వం ఇప్పటికే ఆమెకు ఉత్తమ నటి పురస్కారాన్ని అందించింది. ఇటీవల ఆమె మీడియాతో మాట్లాడుతూ 'ఏ ప్రాతిపాదికన 'జవాన్' సినిమాలో షారుఖ్‌ఖాన్‌కి అవార్డు ఇచ్చారు? అవార్డు జ్యూరీ మీద సందేహం కలుగుతోంది' అని ఆమె అన్నారు. ఈ సంవత్సరం ఉత్తమ సహాయ నటుడి పురస్కారం ప్రకటించిన నటుడు విజయ రాఘవన్ గురించి చెప్తూ, 'ఇస్తే ఆయనకు జాతీయ ఉత్తమ నటుడి అవార్డు ఇవ్వాలి. అలాంటి నటుడికి సహాయ నటుడి అవార్డు ఇచ్చి షారుఖ్‌ఖాన్‌కి ఉత్తమ నటుడి అవార్డా? ఏంటి ప్రాతిపదిక? 'పూక్కాలమ్' సినిమాలో విజయ రాఘవన్ 100 ఏళ్ల వయసున్న వృద్ధుడిగా ఎంతో గొప్పగా నటించారు. అలాంటి నటుడికి కదా ఉత్తమ నటుడి పురస్కారం రావాలి. భారీ బడ్జెట్ పెట్టి, ఇతర భాషల్లో తీసినట్లు 250 రోజులు తీసిన సినిమా కాదు 'పూక్కాలమ్'. అంత మాత్రాన గొప్ప సినిమా కాకుండా పోతుందా?' అని ఆమె ప్రశ్నించారు. కుడోస్ టు నటి ఊర్వశి.

ఈ మాత్రం ధైర్యంగా నిలదీసి అడిగే దమ్ము, ధైర్యం ఎంతమంది ఉంది? ఫలానా సినిమాకు ఏ ప్రాతిపదికన ఇచ్చారనే ప్రశ్న విమర్శకులో, సాంకేతిక నిపుణులో కాదు, ఏకంగా ఒక సీనియర్ నటి అడిగినప్పుడు కదా నిజంగా చర్చ జరుగుతుంది.

ఊర్వశికి ఇది తొలి జాతీయ అవార్డు కాదు. 2006లో 'అచ్చువింటె అమ్మ' అనే మలయాళ సినిమాకుగానూ జాతీయ ఉత్తమ సహాయనటి పురస్కారం అందుకున్నారు. ఆ సమయంలో ఉత్తమ నటుడిగా 'బ్లాక్' సినిమాకుగానూ అమితాబ్ బచ్చన్ అవార్డు అందుకున్నారు. కానీ ఆమె ఏ కామెంట్లూ చేయలేదు. తగిన నటుడికే అవార్డు వచ్చిందని భావించారు.

## వీరమల్లు పక్కనే 'అతడు' అదుర్స్




టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోలు అనగానే ముందు వినిపించే పేర్లలో మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ పేర్లు ఖచ్చితంగా ఉంటాయి. వారిద్దరికీ ఉన్న ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇద్దరూ పాన్ ఇండియా మార్కెట్ పెద్దగా లేదు, కానీ తెలుగు రాష్ట్రాల్లో వారికి ఉన్న ఫాలోయింగ్ ఏ పాటిదో గతంలో పలు సార్లు నిరూపితమైంది. వీరిద్దరి కాంబోలో సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. అది సాధ్యం కాలేదు, ముందు ముందు సాధ్యం కాకపోవచ్చు. అయితే పవన్ కళ్యాణ్ సినిమాలో మహేష్ బాబు డబ్బింగ్ చెప్పడం ద్వారా ఒక రికార్డ్ క్రియేట్ చేశారు. ఆ సమయంలో ఇద్దరికీ కామన్ మిత్రుడు అయిన త్రివిక్రమ్ ఆ అరుదైన కలయికకు మూలం అయ్యారు. ఆ తర్వాత మళ్లీ అలాంటి చిన్న చిన్న కలయిక కూడా జరగలేదు. పవన్ కళ్యాణ్, మహేష్‌బాబు కటౌట్స్ ఇద్దరిని సింగిల్ స్క్రీన్ మీద చూడటం చాలా అదరుగా జరుగుతూ ఉంటుంది. ఒకటి రెండు సార్లు పవన్ కళ్యాణ్, మహేష్ బాబు కలిసి ఉన్న ఫోటోలు వీడియోలు వచ్చాయి. కానీ పవన్ రాజకీయాల్లో బిజీ అయిన తర్వాత, ఉప ముఖ్యమంత్రిగా బిజీగా ఉన్న నేపథ్యంలో అది అసాధ్యంగా మారింది. ఇలాంటి సమయంలో పవన్ కళ్యాణ్ వీరమల్లుగా, మహేష్ బాబు అతడుగా సింగిల్ ఫ్రేమ్ లో కనిపించారు. అయితే రియల్‌గా కాకుండా ఇద్దరూ కటౌట్స్ లో కనిపించి అలరించారు. ప్రస్తుతం ఈ స్టిల్ సోషల్ మీడియాలో సునామి మాదిరిగా విస్తరిస్తుంది. ఏ థియేటర్ లో తీశారు, ఎవరు తీశారు అనే విషయాలు ఏమీ అక్కర్లేకుండానే అభిమానులు, నెటిజన్స్, ఇండస్ట్రీ వర్గాల వారు ఇలా ప్రతి ఒక్కరూ ఈ ఫోటోను షేర్ చేస్తున్నారు, అంతే కాకుండా సేవ్ చేసుకుంటున్నారు. అతడు రీ రిలీజ్‌కి భారీ ఏర్పాట్లు పవన్ కళ్యాణ్ నటించిన హరి హర వీరమల్లు సినిమా ఇంకా థియేటర్‌లో ఉంది. దానికి సంబంధించిన కటౌట్స్ భారీ ఎత్తున ఉన్నాయి. ఇక ఏ థియేటర్ లో అయితే వీరమల్లు ఆడుతుందో అదే థియేటర్‌లోని ఇంకో స్క్రీన్‌లో మహేష్‌బాబు హీరోగా నటించి కల్ట్ మూవీగా నిలిచిన అతడు రీ రిలీజ్ కాబోతున్న విషయం తెల్సిందే. అతడు రీ రిలీజ్ నేపథ్యంలో ఫ్యాన్స్ సందడి భారీ ఎత్తున చేస్తున్నారు. ముఖ్యంగా అతడు రీ రిలీజ్ కాబోతున్న కొన్ని థియేటర్ల వద్ద భారీ ఎత్తున హోర్డింగ్స్, ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల విడుదలైన వీరమల్లు సినిమాకు ఏమాత్రం తగ్గకుండా అతడు సినిమా కటౌట్‌ను భారీ ఎత్తున పెట్టడం జరిగింది. మహేష్ బాబు, పవన్ కళ్యాణ్‌ల కటౌట్‌లను చూస్తూ ఉంటే కన్నుల పండుగ అన్నట్లుగా ఉందని ఫ్యాన్స్ అంటున్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

# అరె వో 'సాంబా'.. మసూరి పండింది!

## ◆ ఆంధ్ర, తెలంగాణ తొడగొట్టి చెప్పుకోదగ్గ వరి కథ



దేశం తీవ్రమైన ఆహార ధాన్యాల కొరతను ఎదుర్కొంటున్న 1970–80 దశకాల్లో ఆంధ్రప్రదేశ్ శాస్త్రవేత్తలు రూపొందించిన వరి వంగడాలు ఇవాళ రెండో హరిత విప్లవానికి నాంది పలకనున్నాయి. రాష్ట్రంలోని బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధిపరిచిన సాంబా మసూరీ, కాటన్ దొర సన్నాలు అత్యధిక దిగుబడి ఇవ్వనున్న రెండు వరి వంగడాలకు (డీఆర్ఆర్ ధన్ 100 (కమల), డీఎస్టీ 1 పూసా) జన్మనిచ్చాయి. ఈ రెండింటిని తొలి స్వదేశీ జీనోమ్ ఎడిటెడ్ వంగడాలుగా పిలుస్తున్నారు.

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇటీవల పార్లమెంటులో చెప్పిన ప్రకారం.. పబ్లిక్ సెక్టార్‌లో అభివృద్ధి చేసిన బీపీటీ 5204, ఎంటీయూ 1010 అనే పేరెంట్ వరి వంగడాల ఆధారంగా స్వదేశీ పరిశోధనలతో కొత్త వాటిని రూపొందించారు. భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ జీనోమ్ ఎడిటెడ్ వరి వంగడాలు ఇవి.

ప్రపంచంలోనే తొలిసారి ఆవిష్కరించిన ఈ రెండు అధిక దిగుబడి జీనోమ్ ఎడిటెడ్ వరి వంగడాలు పూర్తిగా స్వదేశీ ప్రయత్నాల ఫలితంగా రూపొందాయి. ఈ విత్తనాలను రైతులకు ప్రభుత్వ ఆధీనంలోని సంస్థల ద్వారా అందిస్తారు.

డీఆర్ఆర్ ధన్ 100 (కమల), డీఎస్టీ 1 పూసా వంగడాలను హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్), ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐఏఆర్ఐ) అభివృద్ధి చేశాయి. ఇవి వచ్చే 4–5 ఏళ్లలో వాణిజ్యపరమైన సాగుకు సిద్ధం కానున్నాయని హైదరాబాద్‌లోని సీఐఏఆర్, ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎం.సుందరం చెప్పారు. "వాటి విత్తనాలను ఆయా అభివృద్ధి సంస్థలు, నేషనల్ సీడ్ కార్పొరేషన్, భారతీయ బీజ సహకారి సమితి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తాయి" అన్నారు.

"ఈ వరి వంగడాల అభివృద్ధికి ఉపయోగించిన సాంకేతికత పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానమే. ఇవి ధాన్యం దిగుబడిని 25–30 శాతం పెంచే సామర్థ్యం కలిగి ఉంటాయి" అని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ టి.హరికృష్ణ 'ది ఫెడరల్' ఆంధ్రప్రదేశ్ ప్రతినిధితో చెప్పారు. "ఇవి ప్రపంచంలోనే తొలి జీనోమ్ ఎడిటెడ్ వరి వంగడాలుగా నిలుస్తాయి. లక్షలాది హెక్టార్లలో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించే లక్ష్యాన్ని సాధించడంలో ఇవి తోడ్పడతాయి. ఈ వంగడాలు రెండో హరిత విప్లవానికి తోడ్పడతాయి" అని హైదరాబాద్‌లోని ఐసీఏఆర్, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు.

2020 నుండి ఇప్పటివరకు, వ్యవసాయ మంత్రిత్వశాఖ వివిధ ప్రాజెక్టుల కింద జీనోమ్ ఎడిటింగ్ పరిశోధనకు రూ.486 కోట్లు కేటాయించింది. 2022లో, ప్రభుత్వం కొన్ని రకాల జీనోమ్ ఎడిటెడ్ పంటలను జన్యుమార్పిడి పంటలకు వర్తించే కఠినమైన బయోసేఫ్టీ నియంత్రణల నుంచి మినహాయించింది. దీని ఉద్దేశ్యం ఈ సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించడం, దేశంలో పంటల జన్యు మెరుగుదలను వేగవంతం చేయడం.

ఈ కొత్త వంగడాలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 90 లక్షల హెక్టార్లలో సాగు చేసే "సాంబా మసూరీ", "కాటన్ దొర సన్నాలు" వంగడాలను భర్తీ చేయనున్నాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, బీహార్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్ వంటి ప్రధాన వరి ఉత్పత్తి రాష్ట్రాలకు ఈ వంగడాలను సిఫారసు చేశారు. డీఆర్ఆర్ ధన్ 100 (కమల) ప్రత్యేకత ఏమిటంటే.. ఈ రకం సగటు దిగుబడి హెక్టారుకు 5.37 టన్నులు (సాంబ మసూరీ కంటే సుమారు 19% అధికం). అనుకూల పరిస్థితుల్లో హెక్టారుకు 9 టన్నుల వరకు కూడా సాధ్యమవుతుంది. సాధారణ రకాల కంటే 15–20 రోజుల ముందే పండుతుంది (సుమారు 130 రోజులు). ఖరీఫ్, రబీ సీజన్లలో కూడా ఈ వంగడాన్ని సాగు చేయవచ్చు. నీటి కొరత ఉన్న ప్రాంతాలకు కూడా ఇది అనుకూలం. ఏడాదికి సుమారు 7,500 మిలియన్ క్యూబిక్ మీటర్ల వరకు నీటిని పొదుపు చేయవచ్చు.

పూసా రైస్ డీఎస్టీ–1 ప్రత్యేకత.. మాతృ వంగడమైన ఎంటీయూ 1010తో పోలిస్తే పూసా రైస్ డీఎస్టీ 1 రకం 30.4 శాతం అధిక దిగుబడిని ఇస్తుంది. చౌడు భూములు, తీరప్రాంత భూముల్లోనూ (సెలైన్ & అల్కాలైన్ సోయిల్స్) సాగుచేయవచ్చు. నీటి ఎద్దడిని తట్టుకోగలదు. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. దేశానికి అన్నపూర్ణ – ఆంధ్రప్రదేశ్ వరి పరిశోధన.. బాపట్ల–మార్టేరు వంగడాలు భారత తొలి జీనోమ్ ఎడిటెడ్ వరి వంగడాలకు పునాది కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాస్త్రవేత్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. 1970–80 దశకాల్లో దేశం తీవ్రమైన ఆహార ధాన్యాల కొరతను ఎదుర్కొంటున్న సమయంలో, ఆంధ్రప్రదేశ్ శాస్త్రవేత్తలు రూపొందించిన వరి వంగడాలు కోట్లాది రైతుల జీవితాలను మార్చాయి. బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం, పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు వరి పరిశోధనా కేంద్రం అభివృద్ధి చేసిన బీపీటీ 5204 (సాంబ మసూరీ), ఎంటీయూ 1010 రకాలు దేశవ్యాప్తంగా 46 మిలియన్ల హెక్టార్లలో సాగవుతున్నాయి.

బాపట్ల వ్యవసాయ కళాశాల (ఏఎన్‌జీఆర్ ఏయూ) తొలి తరం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.వి.ఆర్.కృష్ణమూర్తి, డాక్టర్ మాలకొండారెడ్డి, ఆయన బృందం అహోరాత్రులు కష్టపడి బీపీటీ 5204 – 'సాంబా మసూరీ'ని రూపొందించాయని అదే కళాశాలలో వ్యవసాయ శాస్త్రం చదివి శాస్త్రవేత్తగా ఎదిగిన డాక్టర్ హరికృష్ణ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 145–150 రోజుల్లో పంట చేతికి వచ్చే ఈ వంగడం ఆంధ్రప్రదేశ్‌ను అన్నదాతను చేసిందని అన్నారు. ఎంటీయూ 1010 – (కాటన్ దొర సన్నాలు) రకాన్ని 1988లో మార్టేరు రైస్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తలు రూపొందించారని, ఈ పరిశోధనకు శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రామప్రసాద్, డాక్టర్ కె.వెంకట రామయ్య నాయకత్వం వహించినట్టు ఏపీ అగ్రిమిషన్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎంవీఎస్ నాగిరెడ్డి చెప్పారు. ఐదారు నెలల పంట కాలాన్ని ఈ వంగడం 120–125 రోజులకు తగ్గించిందన్నారు. ఆనాడు ఇదో సంచలనంగా అభివర్ణించారు.

భారతీయ తొలి స్వదేశీ జీనోమ్ ఎడిటెడ్ వరి వంగడాలకు ఆంధ్రప్రదేశ్ వంగడాలు పునాది కావడం ఎంతో గర్వకారణంగా ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ వలేటి గోపిచంద్ అన్నారు. బీపీటీ 5204, ఎంటీయూ 1010 వంగడాలు లేకపోతే డీఆర్ఆర్ ధన్ 100, డీఎస్టీ 1 వంటి ఆధునిక జీనోమ్ ఎడిటెడ్ రకాల రూపకల్పన సాధ్యమయ్యేది కాదని, ఇది ఆంధ్రప్రదేశ్ శాస్త్రవేత్తల ప్రతిభకు గర్వకారణం అని గోపీచంద్ కొనియాడారు. "బీపీటీ 5204, ఎంటీయూ 1010 రకాలు ఒక కాలంలో దేశ ఆహార భద్రతను కాపాడగా, భవిష్యత్తు పంటల మెరుగుదలకు మార్గదర్శకాలు అయ్యాయి. ఈ కృషి తరతరాలకు స్ఫూర్తి" అని పద్మశ్రీ అవార్డు గ్రహీత, డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ శాస్త్రవేత్తలు రూపొందించిన ఈ రెండు వంగడాలు దేశానికి అన్నపూర్ణగా నిలిచాయి. గతంలో రైతుల ఆదాయాన్ని పెంచి, ఆహార భద్రతను బలోపేతం చేశాయి. ఇప్పుడు ఇవే భారత తొలి స్వదేశీ జీనోమ్ ఎడిటెడ్ వరి రకాల పునాది కావడం రాష్ట్రానికి మరింత గర్వకారణం. ఈ విజయాలు శాస్త్రీయ ప్రతిభకు నిదర్శనం మాత్రమే కాకుండా, ప్రపంచానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాస్త్రవేత్తల కీర్తిని చాటుతున్నాయి.

**- అమర్నాథ్ ఆకుల**

# పాపం పసివారు..!



**"ఏ తల్లి పాడేను జోల.. ఏ తల్లి ఊపేను డోల.. ఎవరికి నీవు కావాలి.. ఎవరికి నీ మీద జాలి.."** మొన్న ఒకేరోజు పత్రికల్లో దాదాపుగా ఒకే అంశానికి సంబంధించిన రెండు వార్తలు వచ్చాయి. మొదటిది హైదరాబాద్‌లో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ మోసంలో అనాథగా మిగిలిన పిల్లవాడు కాగా, రెండోది హిమాచల్ వరదల్లో తనవారిని కోల్పోయిన చిన్నారిని ప్రభుత్వంతో సహా అందరూ అక్కున చేర్చుకోవడం. రెండుచోట్లా బాధితులు పసివారే. వారి బాధ్యత తీసుకోవడంలో ఎంత వైరుధ్యం?

ముందుగా సృష్టి టెస్ట్యూబ్ సెంటర్ నిర్వాకం చూద్దాం.. వీళ్లు పిల్లలు లేని దంపతులని ఎంచుకుని సంతాన భాగ్యం కలిగిస్తామంటారు. మెల్లగా సరోగసికి ఒప్పిస్తారు. ముందే ఎవరెవరి నుంచో వీర్యం సేకరించి ఉంచుతారు. పేదవాళ్లని డబ్బుతో కొని సరోగసికి ఒప్పిస్తారు. కొన్నిసార్లు వారి బిడ్డనే కొని, సరోగసి ద్వారా జన్మించినట్టు నమ్మించి సంతానం కోసం వచ్చిన వారి దగ్గర నుంచి లక్షల రూపాయలు వసూలుచేస్తారు. అలా ఒక దంపతులు సంతానం కలగడం లేదని వెళ్లారు. వారిని సరోగసికి ఒప్పించారు. ఫీజు లక్షల్లో ఉండగా విడతల వారీగా వసూలు చేశారు. మరో రాష్ట్రానికి చెందిన జంటకి పుట్టిన పిల్లాడిని సరోగసి ద్వారా పుట్టాడని అప్పగించారు. అయితే పిల్లవాడి రూపురేఖలు తేడాగా ఉండటంతో డిఎన్ఏ టెస్ట్ చేయించారు. అసలు నిజం బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. డొంకంతా కదిలింది. తమకు పుట్టలేదు కాబట్టి ఆ పిల్లవాడు వద్దు అని వదిలేశారు. ఈలోగా అసలు తల్లిదండ్రులు అరెస్ట్ అయి జైలులో ఉన్నారు.

**ప్రస్తుతం ఆ బిడ్డడు ప్రభుత్వ శిశువిహార్‌లో ఉన్నాడు. రెండు నెలల లోపు తల్లిదండ్రులు తీసుకెళ్లకపోతే ప్రభుత్వం దత్తతకు పెడుతుంది. ఇక్కడ తప్పెవరిది? కాసులకు కక్కుర్తి పడ్డ పేదరికానిదా? లక్షలతో వ్యాపారం చేసే డాక్టరుదా? సరైన పర్యవేక్షణ చేయని ప్రభుత్వానిదా? ఇప్పుడు ఎవరు పాడాలి జోల?**

హిమాచల్‌ప్రదేశ్‌లో మొన్న జూన్ నెలలో ఆకస్మికంగా వరదలు వచ్చాయి. అమ్మ, నాన్న, నాన్నమ్మల మధ్య హాయిగా నిద్రపోతున్న నెలల చిన్నారి నికితకు తెలీకుండానే తన వారంతా వరదలో కొట్టుకుపోయారు. అయినా తల్వారా గ్రామస్తులు ప్రేమతో అక్కున చేర్చుకున్నారు. ఆమె బంధువులు, దేశవిదేశాల వారు దత్తత చేసు



కుంటామని ముందుకొచ్చారు. కానీ సమీప బంధువుకు సంరక్షణ అప్పగించారు. ఇప్పుడు ప్రభుత్వం ముఖ్యమంత్రి సుఖ ఆశ్రయ యోజన పథకం కింద నికితను చేర్చుకుంది. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల కోసం ఉద్దేశించిన ఈ పథకం ద్వారా నిఖితకు 27 సంవత్సరాలు వచ్చేవరకు నెలకు నాలుగువేల రూపాయలు పోషణ కోసం ఇస్తారు. ఇప్పటికే ఆమె సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో జులై, ఆగష్టు రెండు నెలలకు 8వేల రూపాయలు వేసినట్టు మండి డిప్యూటీ కమిషనర్ అపూర్వ్ దేవగన్ తెలిపారు. ఇటువంటి దుర్ఘటనల్లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ఆదుకోడానికి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా కృషి చేస్తోందని తెలిపారాయన. ఇప్పుడు ఎవరైనా నికితకు ధైర్యంగా జోల పాడతారు. డోలా ఊపుతారు. ఆ పాప అందరికీ అపురూపమే!

**- కె.శోభ**

# విభిన్న చరిత్ర వారసత్వాలు కళింగ నేల సొంతం

- ☆ కళింగాంధ్ర చరిత్ర విస్మరణకు గురైంది
- ☆ ప్రశ్నించే తత్వం ఉండకపోవడంతోనే కళింగాంధ్ర వనరులు ఈ నేలకు చెందకుండా పోతున్నాయి
- ☆ స్థానిక వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ఆర్.రజని
- ☆ ఎన్నో నదులున్నా కళింగాంధ్రుడి కంట కన్నీరే పారుతుంది
- ☆ ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు
- ☆ మరింత ఉద్యమిస్తే నేతల ఆలోచనల్లో మార్పు వస్తుంది
- ☆ సీనియర్ పాత్రికేయులు, రచయిత నల్లి ధర్మారావు
- ☆ ఘనంగా 'ముంజూరు' కళింగాంధ్ర కవితా వార్షిక ఆవిష్కరణ



**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

సంస్కృతి, సంప్రదాయాలు, భౌగోళిక, సామాజిక చైతన్యాలు, భాష యాసల్లో ఎంతో విశిష్టమైన, విభిన్నమైన చరిత్ర వారసత్వాలు కళింగ నేల సొంతమని వక్తలు అభిప్రాయపడ్డారు. నాటి అశోకుని దండయాత్ర నుంచి నేటి బీల పోరాటం వరకు కళింగాంధ్ర తిరుగులేని ఆత్మాభిమానం చాటుకుందని అన్నారు. దేశానికే స్ఫూర్తిదాయకమైన కళింగసీమ చరిత్రకు ఆంధ్రుల చరిత్ర రచనలో సరైన చోటు దొరకలేదని, పరిశోధకులు, చరిత్ర అధ్యయనకారులచే విస్మరించబడటం విచారకరమన్నారు.

స్థానిక వర్సిటీలో జరిగిన 'ముంజూరు' కళింగాంధ్ర కవితా వార్షిక ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ కె.ఆర్. రజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటితరంలో ప్రశ్నించే తత్వం, చైతన్యం పూర్తిస్థాయిల్లో ఉండకపోవడంతో కళింగాంధ్ర వనరులు ఈ నేలకు చెందకుండా పోతున్నాయన్నారు. కవులు, కళాకారులు ఆ దిశగా మరింతగా కృషి చేసి సమాజాన్ని జాగృతపరచాలన్నారు. ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ కళింగాంధ్ర పోరాట పటిమ నేటికీ నడుస్తోన్న అనేక ఉద్యమాలు, రచనల్లో కనిపిస్తూనే ఉన్నాయన్నారు. ఎన్నో నదులున్నా కళింగాంధ్రుడి కంట కన్నీరే పారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖారవేలుడు పాలించిన నేల కళింగాంధ్ర అని గర్వంగా చెప్పుకోవాలని అన్నారు.


సీనియర్ పాత్రికేయులు, రచయిత నల్లి ధర్మారావు మాట్లాడుతూ చారిత్రాత్మకంగా ఎంతో వైభవాన్ని, ఖ్యాతిని కలిగిన నేల కళింగసీమ అని అన్నారు. బౌద్ధ, జైన మతాలు విరజల్లి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పోరాటాల వలనే ఈ నేలలో ఇప్పుడున్న ప్రాజెక్టులైనా కట్టారని, మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తేనే రాజకీయ నేతల ఆలోచనల్లో మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత మాండలిక పరిరక్షణకు రావిశాస్త్రి, పతాంజలి, అట్టాడల తర్వాత ఎవరనే ప్రశ్న ఉత్పన్నం కారాదన్నారు. సిక్కోలు బుక్స్ ప్రచురణకర్త దుప్పల రవికుమార్ మాట్లాడుతూ సువిశాల తీరం, విస్తారమైన మైదాన ప్రాంతం, సుందరమైన అటవీ ప్రాంతం కలిగిన నేల కళింగమని అన్నారు. మరుగునపడి విస్మరణకు గురైన కళింగాంధ్ర చరిత్ర ఈ తరానికి తెలియజేసే కృషి సిక్కోలు బుక్స్ చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. అనురాధ, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, డాక్టర్ కె.ఉదయ్ కిరణ్, డాక్టర్ జి.లీలా వరప్రసాద్, ఇంజనీరింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కోటా తగ్గింపు నిర్ణయం వెనక్కు తీసుకోవాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న కీలక నిర్ణయమైన 2025–26 విద్యాసంవత్సరం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న ఇన్‌సర్వీస్ డాక్టర్లకు ఉన్న పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేట్) కోటాను 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల డాక్టర్ల అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) తీవ్రంగా ఖండించింది. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా హామీ మేరకు ఇన్‌సర్వీస్ పీజీ కోటాపై ఏ నిర్ణయం అయిన ఏపీపీహెచ్‌సీడీఏ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపాకే తీసుకుంటామని చెప్పి, ఎటువంటి అధికారిక సమాచారం లేకుండా మీడియా ద్వారానే ఈ నిర్ణయం గురించి వెలుగులోకి రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గిరిజన, పల్లెటూర్ల ప్రాంతాలలో వనరులు లేని పరిస్థితుల్లో సేవలందిస్తున్న వైద్యులకు విద్యాఅవకాశాలు తగ్గిపోతున్నాయన్నారు. ఇది భవిష్యత్తులో పల్లెటూర్లలో పనిచేయడానికి ఆసక్తి చూపే వైద్యుల సంఖ్యపై కూడా ప్రభావితం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించాలని కోరారు.

# కాలేయ మార్పిడికి సాయమందించండి



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

జిల్లాకు చెందిన శ్రీకాంత్, శ్రుతిల ఏడు నెలల వయసు గల చిన్న కుమార్తె ప్రాణాంతక కాలేయ వ్యాధి, పిత్తాశయ అట్రేసియాతో బాధపడుతోంది. ఆమెకు కాలేయ మార్పిడి అత్యవసరమని వైద్యులు తెలిపారు. వైద్యం చేయించడానికి ఆర్థిక స్తోమత చాలని తల్లిదండ్రులు దాతలు సాయం చేయాలని కోరుతున్నారు. ఇది వరకు కొందరు సాయమందించారని, శస్త్రచికిత్సకు రూ.25 లక్షలు అవసరమని తెలిపారు. ఇది తమ స్తోమతకు మించినది కావటంతో మరోసారి దాతలను అభ్యర్థిస్తున్నారు. చిన్నారి వైద్యానికి సాయమందించాలనుకునే దాతలు 70080 14792, 90306 24875 నెంబర్లకు ఫోన్‌పే గాని, లేదా ఎస్‌బీఐ అకౌంట్ నెంబరు 31426281103, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ IFSC-SBIN0000966 టెక్కలి బ్రాంచ్‌కు పంపగలరని కోరారు.


















# ప్రకృతి ప్రకోపానికి ఉత్తరకాశీ విలవిల..

ఒక్కసారిగా క్లౌడ్ బరస్ట్. ఒక్కసారే పది సెంటీమీటర్ల వర్షపాతం. ఆకాశానికి చిల్లుపెడితే కురిసిన కుండపోత. ఆతర్వాత ఎప్పుడూ కనీవినీ ఎరుగనీ విపత్తు.. ఉత్తరాఖండ్‌లోని ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉండే ధరాలీ గ్రామం మెరుపు వరదలకు పూర్తిగా కొట్టుకు పోయింది. సముద్రం మీద పడిందా అన్న స్థాయిలో క్లౌడ్ బరస్ట్ అయింది. దీంతో నీరు, అక్కడున్న మట్టి కలిసి పెద్ద ఎత్తున బురద వరద ధరాలిని కప్పేసింది. అందమైన గ్రామం ఇప్పుడు మట్టి దిబ్బను తలపిస్తోంది.

ఉత్తరాఖండ్‌లో కుండపోత వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఉత్తర కాశీలో వరదల కారణంగా ఓ గ్రామం తుడిచిపెట్టుకుపోయింది. వరదల ధాటికి ఇళ్లు, హెూటళ్లు కుప్ప కూలిపోయాయి. అనేకమంది గల్లంతయ్యారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరద బీభత్సం తీవ్ర విషాదాన్ని నింపింది. అకస్మాత్తుగా ముంచెత్తిన వరదల్లో నలుగురు చనిపోగా.. 60-70 మంది వరకు వరదల్లో చిక్కుకుపోయినట్లు సమాచారం. ఇప్పటి వరకు సహాయక బృందాలు 12 మంది మృతదేహాలను వెలికితీశాయి. మిగతా వారి కోసం గాలిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

వరదల్లో హర్షిల్‌లోని సైనిక శిబిరం కొట్టుకుపోగా.. 10 మందికిపైగా జవాన్లు గల్లంతయ్యారు. అయితే ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. వరదల్లో గల్లంతైన వారి గురించి ఇంకా పూర్తి స్థాయిలో కచ్చితమైన సమాచారం లేదంటున్నారు అధికారులు. ఒక్కసారిగా విరుచుకుపడ్డ బురదతో కూడిన వరద.. కింద ప్రాంతంలోని ధరాళీ గ్రామం వైపునకు దూసుకొచ్చింది. వరద ధాటికి 3, 4 అంతస్తుల భవనాలు సైతం పేక మేడల్లా కూప్పకూలిపోయాయి. వరద ధాటికి కొట్టుకుపోయాయి. వరద తాకిడికి గ్రామంలో 20-25 హెూటళ్లు, హెూంస్టేలు కూడా కొట్టుకుపోయాయి.

ఆకస్మిక వరదలపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల్లో ఎలాంటి లోపం లేకుండా చూడాలని సీఎం పుష్కర్‌సింగ్ ధామికి ఫోన్‌లో సూచించారు. సహాయక చర్యల కోసం 150 మంది సైనికులను సంఘటనా స్థలానికి పంపినట్లు ఆర్మీ వెల్లడించింది. వల్ల ఇప్పటికే చాలా మంది ప్రజలు దిగ్బంధంలో ఉన్నారు. పరిస్థితి భయానకంగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ అధికారులు సూచించారు.

మరోవైపు ఉత్తరకాశికి 20 కి.మీ ముందు నలుపానిలో పెద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. దీని కారణంగా పర్వతం నుంచి భారీ శిథిలాలు రోడ్డుపై పడి రాకపోకలు బంద్ అయ్యాయి. భట్వారీలో దాదాపు 150 మీటర్ల రోడ్డు కొట్టుకు పోయిందని, దీని కారణంగా రోడ్డు పూర్తిగా మూసుకు పోయింది. దీంతో అనేక బృందాలు మార్గమధ్యలో చిక్కుకున్నాయి. రక్షణ కోసం ధరాలికి వస్తున్న ఐటీబీపీ జవాన్లు మనేరి సమీపంలో చిక్కుకున్నారు.

ఈ నెల 10 వరకు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలకు అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో స్థానికులు, పర్యాటకులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు.



# కళింగ కోమట్లలో ఎన్నికల కుంపటి!

మొదటిపేజీ తరువాయి

అనేక ప్రాంతాల్లో ఉన్న కుల సంఘం పెద్దల మద్దతు ఉందని, రమేష్ ఈ మేరకు మనుషులను కూడగట్టాల్సి వస్తుందనే ప్రచారం జరిగింది. మాజీ మున్సిపల్ చైర్మన్ అంధవరపు వరహానర సింహం కుమారుల్లో ఎవరో ఒకరు నగర బాధ్యత లు చేపట్టాలనే ప్రతిపాదనలు వెళ్లాయి. అయితే కళింగకోమట్లలో ట్రస్ట్ ప్రతిష్ఠాత్మకమైనది కాబట్టి ఆ పదవి తీసుకోమని వరం పెద్దకుమారుడు ప్రసాద్‌ను కోరే అవకాశాలు ఉన్నందున నగర సంఘం అధ్యక్షుడిగా కోరాడ హరిగోపాల్, కార్య దర్శిగా కిల్లంశెట్టి రమేష్‌లతో కూడిన బృందం పగ్గాలు చేపడుతుందని, కోరాడ రమేష్‌ను ఏదో రకంగా బుజ్జగిస్తారని ప్రచారం జరిగింది. కానీ అకస్మాత్తుగా కళింగకోమట్లలో ఎవరు చెబితే అన్ని తరాల నాయకులూ తలూపుతారో, ఎవరు ఆర్థికం గా పరిపుష్టిగా ఉన్నారో, ఎవరికి పార్టీలకు అతీతంగా అందరి అండదండలూ ఉన్నాయో.. అటువంటి ఊణ్ణ సర్వేశ్వరరావు తాను నగర కళింగకోమటి సంఘం అధ్యక్షుడిగా పని చేయడా నికి సిద్ధంగా ఉన్నానంటూ సంకేతాలు పంపారట. రెండు రోజులుగా మార్కెట్‌లో ఇదే టాక్. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బిజీగా ఉండే సర్వేశ్వరరావు ఇంతవరకు కుల రాజకీయాల్లోకి రాలేదు. ఆయన కు పార్టీల అఫీలియేషన్ కూడా లేదు. అప్పటి రెవెన్యూ మంత్రి నుంచి ఇప్పటి వ్యవసాయ శాఖ మంత్రి వరకు అందరితోనూ వ్యాపార రీత్యా ఆయనకు పరిచయాలున్నాయి. గతంలో అనేక మార్లు ధర్మాన ప్రసాదరావు తమ పార్టీలోకి రావా లని సర్వేశ్వరరావును ఆహ్వానించడం, ఆయన కాదనడం కళింగకోమట్లకు తెలుసు. కాకపోతే మరికొద్ది రోజుల్లో ఎన్నికలు ఉన్నాయనగా, అప్పటి కళింగకోమటి రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను చేసిన ఓ పని ఇప్పుడు కోరాడ సర్వేశ్వర రావు వైకాపా మనిషి కదా.. అన్న ప్రశ్నను లేవ నెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు కళింగ కోమట్లలో ఎంపిక చేసిన కొన్ని ఇళ్లకు వెళ్లడం, అక్కడ అల్పాహారం తీసుకొని ప్రచారం చేయడం ధర్మానకు ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉత్త రాంధ్రకే పరిమితమైన కళింగకోమట్లకు బీసీ హెూదాను రాష్ట్రంలో 24 జిల్లాలకూ వర్తింపజేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీన్ని మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు ఊణ్ణ సర్వేశ్వరరావు ఇంటిలో బ్రేక్‌ఫాస్ట్ సందర్భంగా ప్రకటించాలని కోణార్క్ శ్రీను చేసిన ప్రతిపాదనను కులం కోణం లో సర్వేశ్వరరావు కాదనలేకపోయారు. ఆ తర్వాత కాలంలో ధర్మాన కూడా రియల్ ఎస్టేట్ రంగం లోకి రావడంతో సర్వేశ్వరరావు సహాయ సహకా రాలు తీసుకున్నారు కాబట్టి ఆయన వైకాపా మనిషేనని ఇప్పుడు కళింగకోమట్లలోని టీడీపీ నేతలు వాదిస్తున్నారు. అయితే సర్వేశ్వరరావుకు ఎక్కడా సభ్యత్వం లేదు.

### ధర్మసంకటంలో పెద్దలు

పెద్దమార్కెట్ వర్తక సంఘం నేతగా కోరాడ హరిగోపాల్ అనేకమార్లు సమర్థవంతంగా పని చేశారని రుజువైంది. గత ప్రభుత్వ హయాంలో పెద్దమార్కెట్‌కు బహునాయకత్వాన్ని వైకాపా నేత లు ఇచ్చిన తర్వాత అంతకు ముందు పని చేసిన హరిగోపాల్ ఎంత సమర్థుడో వర్తకులకు అర్థ మైంది. నగర కళింగకోమటి సంఘంలో యాక్టివ్ గా ఉన్న సభ్యులు కూడా వర్తకులే. కాబట్టి హరి గోపాల్ ఎన్నిక లాంఛనమేనని అంతా భావిం చారు. వరం చిన్నకొడుకు అంధవరపు సంతోష్ కూడా తెర వెనుక హరిగోపాల్‌కే మద్దతు ఇస్తున్నా రని తేలడంతో ఈ నెల 17న జరిగే సమా వేశంలో హరిగోపాల్ పేరును ప్రతిపాదిస్తే పెద్ద ఎత్తున మద్దతు వస్తుందని భావించారు. అనూ హ్యంగా ఇప్పుడు ఊణ్ణ సర్వేశ్వరరావు కూడా బరిలో ఉండటం వల్ల కళింగకోమటి పెద్దలకు ఏం చేయాలో పాలుపోవడంలేదు. స్వయంగా సర్వేశ్వరరావే తాను అధ్యక్షుడు కావాలనుకుంటు న్నానంటే వద్దనడం అంత సులువు కాదని కళింగకోమటి పెద్దలకు తెలుసు. ఎందుకంటే.. ఈ సామాజికవర్గంలో ఎటువంటి కుటుంబ కలహాలు ఉన్నా, వ్యాపార భాగస్వాముల మధ్య తేడాలు వచ్చినా పంచాయితీ తేల్చేది సర్వేశ్వర రావే. ఇప్పుడు ఆయన్ను ఎదురుగా పెట్టుకొని ఎన్నికా? ఎంపికా? అంటే ఏం చేయాలో పాలు పోని పరిస్థితి. జిల్లా సంఘం అధ్యక్షుడి ఎన్నిక విషయంలోనూ ఇంతకుముందే పితలాటకమే ఎదురైంది. ఇప్పుడు నగర సంఘ అధ్యక్షుడి ఎన్నికలో కూడా కీలక మలుపు చోటుచేసుకుంది. పార్టీలుగా వేరైనా సామాజికవర్గపరంగా ఒక్కటిగా ఉన్న సీనియర్లు ఇప్పుడు ఈ గడ్డు పరిస్థితిని ఎలా ఒడ్డెక్కిస్తారో చూడాలి.

# మంచు కొండల్లో దాగిన అణుముప్పు!



హిమాలయాల్లోని ప్రసిద్ధ నందా దేవి పర్వతం అనువుగా ఉంటుం దని భావించారు. అక్కడినుంచైతే చైనా అణు స్థావరాలపై పూర్తిస్థా యిలో నిఘా పెట్టవచ్చన్న ఉద్దే శంతో దాన్నే ఖరారు చేశారు. ఆ మేరకు ఏర్పాట్లు ప్రారంభించారు. నిఘా పరికరాన్ని పర్వతంపైకి తీసు కెళ్లారు. అయితే అదే సమయంలో భీకరమైన మంచు తుపాను దండెత్తడంతో బృందం సభ్యులు నిఘా పరికరాన్ని తాళ్లు కట్టి అక్కడే వది లేసి వెళ్లిపోయారు. తుపాను తగ్గిన తర్వాత వెళ్లి చూస్తే ఆ పరికరం కనిపించలేదు. ఎంత వెతికినా దాని ఆన వాళ్లు కూడా లభించలేదు. దాంతో ఆ రహస్య ఆప రేషన్ అసంపూర్తిగా మంచు కొండల్లో కలిసి పోయింది.

(మొదటిపేజీ తరువాయి)

నిఘా పెట్టడమే ఈ పరికరం ఏర్పాటు వెనుక లక్ష్యం. అప్పటికే చైనా తన మొదటి అణుబాంబు ను తయారు చేసి పరీక్షించింది. ఇది అగ్ర దేశ మైన అమెరికాను ఆందోళనకు గురిచేసింది. చైనా అణు కార్యక్రమాలు ఏ స్థాయిలో జరుగుతున్నా యో తెలుసుకోవాలని అమెరికా భావించింది. కానీ ఆ రోజుల్లో సాంకేతిక ఇంకా అభివృద్ధి చెంద లేదు. ఆకాశవీధుల నుంచి నిఘా పెట్టే శాటిలైట్ వ్యవస్థలు అందుబాటులోకి రాలేదు. దాంతో చైనా, భారత్ సరిహద్దుల్లో ఉన్న హిమాలయ పర్వ తాల నుంచే చైనా అణు కార్యకలాపాలపై నిరంత రం నిఘా వేసే స్థావరం ఏర్పాటు చేయడం తప్ప మరో మార్గం కనిపించలేదు. ఈ పని చేయాలం టే భారత సహకారం తప్పనిసరి. ఆ మేరకు భార త్‌ను అమెరికా సంప్రదించింది. చైనాను తనకు పక్కలో బల్లెంలా భావిస్తున్న భారత్ కూడా ఈ రహ స్య ఆపరేషన్‌కు అంగీకరించింది.

### సంయుక్త బృందం ఆధ్వర్యంలో..

భారత్ అంగీకరించడంతో ఇరుదేశాలు సంయుక్త కార్యాచరణకు శ్రీకారం చుట్టాయి. ప్రసిద్ధ పర్వతా రోహకుడు, ఇండియన్ నేవీ అధికారి అయిన కెప్టెన్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో భారత్, అమెరికా నిపుణులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. దేశ విభజన సమయంలో 15ఏళ్ల వయస్సులో రిఫ్యూజీగా భారతదేశానికి వచ్చేసిన కోహ్లీ తర్వాత నౌకాదళం లో చేరి ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడంలో నిపుణుడయ్యాడు. ప్రపంచంలో ఎత్తయిన ఎవరె స్టుపై తొలిసారి జెండా ఎగురవేసిన టెన్సింగ్ నార్కే వద్ద పర్వతారోహణలో శిక్షణ పొందారు. అందు వల్లే రహస్య మిషన్‌కు కెప్టెన్ కోహ్లీని నాయకు డిగా నియమించారు. నిఘా పరికరం ఏర్పాటుకు

### ఆందోళన ఎందుకంటే..

చైనాపై నిఘా కోసం రూపొందించిన ప్రత్యేక పరికరం ప్లూటోనియంతో పని చేస్తుంది. ఇది అతి ప్రమాదకరమైన రేడియోధార్మిక శక్తిని విడుదల చేస్తుంది. ఆ పరికంలో ఉండే ప్లూటోనియమే ఇప్పు డు శాస్త్రవేత్తలను భయపెడుతోంది. హిమాల యాల్లో నిరంతరం మంచు కరగుతూ ఆ నీరు గంగా, తదితర నదుల్లో కలుస్తుంటుంది. దశా బ్దాల నాటి ఆ రహస్య పరికరం లోని ప్లూటో నియం బయటకువస్తే.. అది నదుల్లో చేరి నీరు విషపూరితమయ్యే ప్రమాదం ఉందంటున్నారు. దశాబ్దాలు గడిచినా ఆ పరికరం ఇప్పటికీ మిస్టరీ గానే మిగిలిపోయింది.

కానీ ఇప్పటికీ నందాదేవి ప్రాంతంలో ఎలాంటి హెచ్చరికల బోర్డులు పెట్ట లేదు. టూరిస్టులు, ట్రెక్కర్లు నడిచే గడ్డి మైదానాల కిందే ప్లూటోని యం పరికరం ఉండే అవకాశ ముంది. హిమాని నదాలు నెమ్మదిగా కరుగుతుంటాయి కనుక వాటి కింద చిక్కుకుపోయిన ఆ పరికరం ఎప్పటికైనా బయటపడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబు తున్నారు. కాగా ఆ పరికరాన్ని అప్పట్లో పర్వ తంపైకి మోసుకెళ్లిన కొందరు పోర్టర్లు ఆ తర్వాత కొన్ని రోజులకే అనారోగ్యం పాలై మరణించారని, దీనికి ఆ పరికరంలో ఉన్న ప్లూటోనియంలోని అణు ధార్మికతే కారణమని భావిస్తున్నారు.

## వారంలో టైల్యాండ్‌కు తోటపల్లి నీరు అందించాలి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల శాసనసభ్యులు నడికుదుటి ఈశ్వరరావు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో తోటపల్లి ప్రాజెక్ట్ అధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారం రోజుల్లో టైల్యాండ్‌కు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు సాగునీరు అందించేలా తగిన విధంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో లావణ్య, జేఈఈస, తహశీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ అధ్యాపకులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇవ్వాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అధ్యాపకు లకు కూడా ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అధ్యాపక అవార్డులను ఇవ్వాలని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గంగు మన్మధరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థలో అక్షరాస్యతలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ పాత్ర కీలకమన్నారు. గవర్నమెంట్ స్టూడెంట్స్ కన్నా గవర్నమెంట్ టీచర్స్, లెక్చరర్స్ కన్నా ప్రైవేట్ స్టూడెంట్స్, ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అధికమన్నారు. తమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక అవార్డుల ఎంపికలో ప్రైవేటు ఉపాధ్యా యులను, అధ్యాపకులను కూడా చేర్చాలని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యా యుల అధ్యాపకులతో పాటు ప్రైవేట్ ఉపాధ్యాయులు అధ్యాపకుల సమిష్టి కృషితోనే విద్యావ్యవస్థలో సమూల మార్పులు వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రి, విద్యా శాఖ కమీషనర్, అన్ని స్థాయిల విద్యా శాఖాధికారులు జోక్యం చేసుకుని ప్రైవేట్ ఉపాధ్యాయుల అధ్యాపకుల కృషిని గుర్తించి ఉపా ధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉత్తమ అవార్డులు ఇవ్వాలని కోరారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉపాధ్యాయ సేవలకుగానూ అవార్డులు ఇవ్వ డం ఆనవాయితీగా వస్తోందన్నారు.

## ఉల్లి పాయలు చెరువు ఉపాధి పనులు చేసుకోవచ్చు

(సత్యంన్యూస్, సోంపేట)



గొల్లగండి పంచాయితీ పరిధిలోని ఉల్లిపాయల చెరువులో ఉపాధి పనులు చేసుకోవడానికి ఎటువంటి అభ్యంతరం లేదని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేశారని మత్స్యకార సహకార సంఘం అధ్య క్షులు గండుపల్లి చిన్నారావు పేర్కొన్నారు. ఈమే రకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ పథకంలో ఉపాధి శ్రామికుల ద్వారా చెరువు మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టే ఈ క్రమంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎన్‌సీసీ సంస్థ వారు చెరువు భూమిపై తమ హక్కు ఉందంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తోందన్నారు. దీనిపై తాను సంబంధిత రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశానన్నారు. దీనికి స్పందించిన వారు చెరువు భూమిపై ఎటువంటి ఎలియేషన్ జరగలేదన్నారని చెప్పార న్నారు. ఎన్‌సీసీ సంస్థకు ఎటువంటి భూమి కేటా యింపులు చేయలేదన్నారు. గ్రామ ప్రజలు ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న చెరువు అభి వృద్ధి పనులను ఎటువంటి భయాందోళనలు లేకుండా కొనసాగించవచ్చని అధికారులు హితవు పలికారన్నారు. ఇది ప్రజలకు ఉపాధి కల్పనతో పాటు నీటి వనరుల అభివృద్ధికి తోడ్పడుతుంద న్నారు.

సమస్య పరిష్కారానికి సహకరించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్, సుడా చైర్మన్ రవికుమార్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, ఇచ్ఛాపురం నియోజక వర్గ జనసేన సమన్వయకర్త దాసరి రాజు, కలెక్టర్, రెవెన్యూ ఇరిగేషన్‌శాఖ అధికారులకు చిన్నారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే శిరీషపై నిందారోపణలు సరికాదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తమ సామాజికవర్గంలోని భార్యాభర్తల తగాదా లో పలాస ఎమ్మెల్యే గౌత శిరీష డబ్బులు తీసుకు న్నారని మాజీమంత్రి అప్పలరాజు నిందారోపణలు చేయడం సరికాదని కళింగకోమటి సంఘ రాష్ట్ర అధ్య క్షులు బోయిన గోవిందరాజులు అన్నారు. నగరం లోని కళింగ వైశ్య కళ్యాణమండపంలో బుధవారం కళింగకోమటి సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. పలాసకు చెందిన తంగుడు కవిత తమ భార్యభర్తల మధ్య వివాదం ఉందని గతంలో వైకాపా నాయకుల చుట్టూ తిరిగినప్పటికీ ఎటువంటి పరిష్కారం చూపలేదన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజును ఆశ్రయించినప్పటికీ కూడా ఒక్క సిట్టింగ్ కూడా ఏర్పాటు చేసిన దాఖలు లేవని వారు వివరించారు. పైగా బాధితమహిళకు న్యాయం చేయకుండా తాత్సారం చేశారన్నారు. టీడీపీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సామాజిక వర్గంలో ఉన్న వైకాపా, టీడీపీ పెద్దలంతా ఎమ్మెల్యే శిరీషను కలిశారన్నారు. ఆమె మానవత్వంతో స్పందించి ఎస్పీతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అటు తర్వాత తాము ఇరు వర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించి తిరిగి తమ్ముడు కవితను అత్తారింటిలోకి పంపించామన్నారు. ఎమ్మెల్యే శిరీషను ఈ విషయంలో దోషిగా చూపిం చాలన్న కుట్రతో శ్రీధర్, అప్పలరాజులు తమ సామా జిక వర్గ పెద్దలను సైతం అవమానించేలా మాట్లాడ డం విచారకరమన్నారు. శిరీషను తామంతా తమ ఇంటి ఆడబిడ్డగా చూస్తామని, ఆమెపై ఇటువంటి ఆరో పణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరిం చారు. ఎమ్మెల్యే శిరీషపై మాజీమంత్రి అప్పలరాజు వ్యాఖ్యలను కళింగ కోమటి సామాజిక వర్గ ప్రతిని ధులు ఖండించారు. కళింగ కోమటి సామాజిక వర్గా నికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తీవ్రంగా మోసం చేసిందని హరగోపాల్ విమర్శించారు. ఇటు వంటి చౌకబారు వ్యాఖ్యలను వైకాపా నాయకులు మానుకోవాలని జామి భీమశంకర్ హెచ్చరించారు. కార్యక్రమంలో అంధవరపు ప్రసాద్, కోరాడ రమేష్, చైతన్యప్రభు, పెదబాబు, వెంకటేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.